పెట్టుబడులు పట్టుకొచ్చింది కేసీఆర్ పాలసీతోనే!

ఇన్వెస్టర్లను ఇప్పటికీ ఆకర్షిస్తున్నది టీఎస్-ఐపాస్ • కొత్త పారిశ్రామిక విధానమేదీ ప్రకటించని కాంగ్రెస్ సర్కార్

టీఎస్-ఐపాస్‌ను చూపించే దావోస్ ఎంవోయూల ఖరారు • తమ సరళీకృత విధానాల వల్లే వస్తున్నాయన్న రేవంత్‌రెడ్డి

తలసరి ఆదాయంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నదన్న సీఎం • 13వ స్థానం నుంచి ఫస్ట్‌కు ఎలా చేరిందని నెటిజన్ల ప్రశ్నలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): దావోస్ పెట్టుబడులకు సంబంధించి సీఎం రేవంత్ మంగళవారం సచివాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌పై పారిశ్రామికరంగ నిపుణులు, నెటిజన్ల నుంచి సెటైర్లు పేలుతున్నాయి. తమ ప్రభుత్వం 13 నెలల్లో తీసుకొచ్చిన సరళీకృత ఆర్థిక విధానాల వల్లే దావోస్‌లో 1.80 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని సీఎం పేర్కొన్నారు. వాస్తవానికి.. రాష్ట్రంలో ఇప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూపొందించిన టీఎస్‌ఐపాస్ విధానమే అమలవుతున్నదని నిపుణులు గుర్తుచేస్తున్నారు. పాత పాలసీలో ఎలాంటి మార్పులు చేయకుండా.. తమ ఘనతగా రేవంత్ ఎలా చెప్పుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పాలసీని ప్రకటించిందని, కానీ దాని అమలు ఎవరికీ తెలియదంటున్నారు. ఈ లెక్కన నిరుడు వచ్చిన 40 వేల కోట్లు, ఈసారి వచ్చిన 1.80 లక్షల కోట్ల పెట్టుబడులను టీఎస్‌ఐపాస్ విధానమే ఆకర్షించిందని స్పష్టం చేస్తున్నారు.

నంబర్ వన్ ఎలా అయ్యాం?

ప్రెస్‌మీట్‌లో సీఎం ఎక్కడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మంచిపై ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. 2004కు ముందున్న టీడీపీ ప్రభుత్వం గురించి మాట్లాడారే తప్ప బీఆర్‌ఎస్ పేరునుగానీ, కేసీఆర్ పేరునుగానీ ప్రస్తావించలేదు. పైగా తలసరి ఆదాయంలో తెలంగాణ ప్రస్తుతం దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నదని, దాన్ని కొనసాగిస్తామని చెప్పారు. గణాంకాల ప్రకారం 2015లో తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలో 13వ స్థానంలో ఉన్నది. 2023-24 నాటికి మొదటిస్థానానికి ఎదిగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేయకుండానే ఇన్ని రాష్ట్రాలను దాటి అగ్రస్థానానికి చేరిందా? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

గతంలో విమర్శించలేదా?

గతంలో దావోస్ పర్యటనలపై కాంగ్రెస్ తరఫున ఎవరూ విమర్శలు చేయలేదని చెప్పడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్ గతంలో చేసిన విమర్శలను గుర్తుచేస్తున్నారు. దావోస్‌కు ఆహ్వానం అందడం అంతా బూటకం అని, సాధారణంగా ఎవరు పోయి డబ్బులు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నా అనుమతి ఇస్తారని విమర్శించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. సౌత్ కొరియా, జపాన్ అంటూ తిరుగుతున్నారని, పెట్టుబడులు రావని, ప్రజల డబ్బులతో విలాసవంతమైన ప్రయాణాలు చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ గతంలో వ్యాఖ్యానించారని అంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో ఉండగా ఈ వీడియో మరోసారి వైరల్ అయ్యింది. అయినా ఆ విషయాన్ని మర్చిపోయి గతంలో విమర్శించలేదని చెప్పడం ఏమిటని నెటిజనులు ప్రశ్నిస్తున్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎనర్జీ పాలసీ వల్లే పెట్టుబడులు వచ్చాయని సీఎం చెప్పడంపైనా నిపుణులు మండిపడుతున్నారు. 2014లో ధ్వంసమై ఉన్న విద్యుత్తు రంగాన్ని పునరుద్ధరించి 2023 నాటికి అన్ని రంగాలకు నిరంతర విద్యుత్తు ఇచ్చే స్థాయికి తీసుకొచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనతను కాంగ్రెస్ చెప్పకపోయినా ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్తున్నారు.

సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో నిద్రమత్తులో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం

- ఆయా సంస్థల వద్దకు వెళ్లి క్రాస్‌చెక్ చేసుకోవచ్చు
- దావోస్ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రెస్‌మీట్‌లో నిద్రమత్తులో జోగిన మంత్రులు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): దావోస్ పర్యటనతో రాష్ట్రానికి రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మంత్రులతో కలిసి మంగళవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. దావోస్‌లో 28 కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్టు తెలిపారు. ఇది తమ ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయమని అన్నారు. రాష్ట్రాన్ని లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న వారికి అవసరమైన భూ కేటాయింపులు, అనుమతులు వంటివి ఇచ్చి ప్రోత్సహిస్తామని అన్నారు. నిరుడు దావోస్ పర్యటనలో మొత్తం 15 కంపెనీలతో 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఇందులో 10 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, 7 ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నట్టు వెల్లడించారు. తాజా పర్యటనలో విద్యార్థులకు నైపుణ్యం పెంచేందుకు సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐటీఈ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడం నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. కొందరు దావోస్ పెట్టుబడులపై అసత్య ప్రచారం చేస్తున్నారని, కావాలంటే మీడియా ప్రతినిధులు నిజనిర్ధారణ కమిటీ వేసుకొని ఆయా సంస్థల వద్దకు వెళ్లి క్రాస్ చెక్ చేసుకోవచ్చని అన్నారు. హైదరాబాద్ కంపెనీలతో దావోస్‌లో ఒప్పందం చేసుకున్నారన్న విమర్శలపై స్పందిస్తూ.. ఆయా సంస్థలు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ పెట్టుబడులు పెట్టేందుకే దావోస్‌కు వెళ్లాయని చెప్పారు. దావోస్‌కు కేవలం పెట్టుబడుల కోసమే వెళ్లలేదని, ప్రపంచ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను తెలుసుకునేందుకు వెళ్లామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రూ. 1.180 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించడాన్ని తాము విజయంగా భావించడం లేదని, వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేసిన ఎనర్జీ పాలసీ వల్లే పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు బాలూనాయక్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కునుకు తీసిన మంత్రులు

ప్రెస్‌మీట్‌లో సీఎంతోపాటు పలువురు మంత్రులు, నేతలు నిద్రమత్తులో కనిపించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో సీతక్క, జూపల్లి కృష్ణారావు, చిన్న కునుకు తీశారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగిస్తుండగా సీఎం ఆవులింతలు తీస్తూ, నిద్రను ఆపుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర నేతలదీ అదే పరిస్థితి. మొత్తంగా చెప్పేదంతా పాత విషయమే కావడంతో ప్రెస్‌మీట్ మొత్తం నిద్రమత్తులో సాగినట్టయ్యింది.

రైతుల అప్పులా? దావోస్ డప్పులా?

- రైతుభరోసా చిల్లర పంచాయితీనా?
- నీకు అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్
- మంచి మానసిక వైద్యుడిని కలువు
- రేవంత్ తీరుపై హరీశ్‌రావు ఫైర్
- దావోస్ పెట్టుబడుల కథ అట్టర్‌ఫ్లాప్ అని ఎద్దేవా

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): 'ఇంతకుముందు రైతు బంధును బిచ్చం అన్నవు. ఇప్పుడు రైతు భరోసాను చిల్లర పంచాయితీ అంటున్నవు. సంక్రాంతికి ఇస్తానన్న సంగతి తేలిపోయింది.. చబ్బీస్ (26) జనవరి చేదు మాత్రనే అయ్యింది. ఇప్పుడు మార్చి 31 దాకా గడువు పెంచినవు. జర్నలిస్టులు ఇదేమని అడిగితే, చిల్లర పంచాయితీ అంటున్నవు. అప్పుల పాలవుతున్న రైతుల ఆవేదనను పక్కనబెట్టి మీ ప్రచారం వినాలా? రైతుల అప్పులు ముఖ్యమా? దావోస్ డప్పులు ముఖ్యమా?' అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. 'మీ సెల్ఫ్ డబ్బాకు, మీ వెకిలి సెటైర్లకు కాలం చెల్లింది. ఇకనైనా కండ్లు తెరువు రేవంత్‌రెడ్డీ. నీలో అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్ మొదలైంది. నీ మాటలను ఎవరూ నమ్మడం లేదనే ఆందోళన పెరిగిపోయింది. మంచి మానసిక వైద్యుడిని సంప్రదించడం మంచిది' అని హితవుపలికారు. దావోస్ పెట్టుబడుల కథ అట్టర్‌ఫ్లాప్ అయిందని, రేవంత్ ఎన్ని ముచ్చట్లు చెప్పినా? కథలు చెప్పినా? తెలంగాణ ప్రజలు నమ్మడం లేదని స్పష్టంచేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ ఎలా ఉన్నదంటే పెట్టుబడుల కట్టుకథను నమ్మించేందుకు శతవిధాలా ప్రయత్నించి అట్టర్‌ఫ్లాప్ అయినట్టు ఉన్నది' అని ఎద్దేవా చేశారు. 'మీ ప్రెస్ రిలీజులు, మీ మీడియా కవరేజీలు, మీ ఈనో స్టోరీలను ఎవరూ నమ్మడం లేదని ప్రెస్‌మీట్ పెట్టినవు. ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడెందుకు దావత్? దావోస్‌లో జరిగే ఎంవోయూలన్నీ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ మాత్రమే. ఎవరైనా ఓపెన్ టెండర్‌లో రావాల్సిందే అని ఆర్థికమంత్రి భట్టి అంటే నువ్వేమో లక్షా 82 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్టు గప్పాలు కొడుతున్నవు. మరి భట్టి చెప్పింది నిజమా? నీ మాటలు నిజమా రేవంత్‌రెడ్డీ?' అని మంగళవారం ఎక్స్ వేదికగా నిలదీశారు. 'పొంతన లేకుండా నువ్వు చెప్పిన కంపెనీలు, పెట్టుబడుల లెక్కలు యావత్ తెలంగాణ ప్రజానీకం గమనించింది. అంతా డొల్ల ప్రచారమని తేలిపోయింది' అని విమర్శించారు.

గిరిజనులకు నాగోబా శుభాకాంక్షలు

గోండుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన నాగోబా జాతర మంగళవారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా గిరిజనులకు హరీశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఆదివాసీ సంబురం దేశంలో రెండో అతిపెద్ద గిరిజన జాతరగా నిలవడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు.

దేవుళ్లకూ కాంగ్రెస్ మొండిచెయ్యి

దేవుళ్లకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని హరీశ్ విమర్శించారు. ధూప దీప నైవేద్యాలకు నిధులను రెండు నెలలుగా ప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. పైసల్లేక పూజారులు ఉద్దెరకు పూజాసామగ్రి తీసుకొచ్చి పూజలు చేస్తున్నారని వాపోయారు. రెండు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధూపదీప నైవేద్యం నిధులు రావడం లేదని ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

దావోస్ పెట్టుబడులపై చర్చకు సిద్ధమా?

బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, జనవరి 28 (నమస్తేతెలంగాణ): 'దావోస్‌కు వెళ్లి రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామంటూ రేవంత్ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం. ఆ పెట్టుబడులపై చర్చించేందుకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉన్నది. దమ్ముంటే ప్రభుత్వ పెద్దలు ఇందుకు సిద్ధమా?' అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య సవాల్ విసిరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నేత ఫయాజ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. దావోస్ పెట్టుబడులపై సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు పరస్పర విరుద్ధంగా మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ సర్కారు పదేండ్లలో అనుసరించిన పారిశ్రామిక అనుకూల విధానాలతో రాష్ట్రానికి 2,000 స్టార్టప్ కంపెనీలు వచ్చాయని తెలిపారు. 7 లక్షల స్క్వేర్ ఫీట్లకు ఆఫీస్ స్పేస్ పెరిగిందని, ఐటీ ఇన్నోవేషన్‌లో 4 శాతానికి చేరిందని గుర్తుచేశారు. 2014లో మూడు లక్షలున్న ఐటీ ఉద్యోగాలను 2024 నాటికి 9 లక్షలకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. ఈ వాస్తవాలను సీఎం రేవంత్ వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. కేవలం తన ఏడాది పాలనను చూసి పరిశ్రమలు తరలివస్తున్నాయని చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. నాడు విత్తనాలు వేస్తే పెరిగిన చెట్లకు కాసిన కాయలను చూపిస్తూ ఆయన తన గొప్పగా పేర్కొనడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కేసీఆర్ గురుకులాలను స్థాపించి పేదలకు విద్యావకాశాలు కల్పిస్తే రేవంత్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ పేరిట గప్పాలు కొడుతున్నారని మండిపడ్డారు.

మరో 2,800 కోట్ల రుణం

- ఆర్‌బీఐ నుంచి కొత్త అప్పు
- వేలంలో పాల్గొని పొందిన కాంగ్రెస్ సర్కారు
- అదనపు అప్పులకు కేంద్రం ప్రభుత్వం ససేమిరా
- నెలకు రూ.10 వేల కోట్లకు ఆర్బీఐకి ఇండెంట్
- జనవరి నెలలో పొందింది రూ.5,800 కోట్లే

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి మంగళవారం మరో రూ.2,800 కోట్ల రుణాన్ని సమీకరించింది. రూ.1000 కోట్ల విలువైన రెండు బాండ్లను 22 సంవత్సరాలు, 24 సంవత్సరాలు, 800 కోట్ల విలువైన బాండును 25 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి జారీచేసింది. మంగళవారం జరిగిన వేలంలో పాల్గొని 2,800 కోట్ల రుణం పొందింది. 7న ఆర్బీఐ నిర్వహించిన వేలంలో పాల్గొని రూ.3000 కోట్ల రుణాన్ని సేకరించింది. 14, 21న నిర్వహించిన వేలంలో పాల్గొనలేదు. చివరి మంగళవారం నాడు పాల్గొని మూడు బాండ్ల ద్వారా 2,800 కోట్లు సమీకరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని కేంద్రం 49,255 కోట్లకు విధించగా, ఇప్పటికే రేవంత్‌ప్రభుత్వం మూడు త్రైమాసికాల్లో తీసుకున్న రుణం రూ.41,759 కోట్లకు చేరింది. కేంద్రం అనుమతించిన అప్పులో ఇంకా రూ.7,500 కోట్ల వరకు రుణాలు చివరి త్రైమాసికంలో తీసుకొనే అవకాశం ఉన్నది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చివరి త్రైమాసికంలో ఏకంగా రూ.30 వేల కోట్ల అప్పు (నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున) తీసుకుంటామని ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. 7న రూ.3000 కోట్లు, 14న రూ.2000 కోట్లు, 21న రూ.2500 కోట్లు, 28న మరో రూ.2500 కోట్లకు ఇండెంట్లు ఇచ్చింది. వీటి కోసం కేంద్రం నుంచిగానీ, ఆర్బీఐ నుంచిగానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. దీంతో అదనపు అప్పు ఇవ్వబోమని కేంద్రం తేల్చి చెప్పినట్టు తెలుస్తున్నది. అందుకే ఈ నెల 14, 21న వేలంలో పాల్గొనటానికి అవకాశం లభించలేదు. ఈ నెలలో రెండు దఫాలుగా (7, 28 తేదీల్లో) రూ.5,800 కోట్ల అప్పును మాత్రం రాష్ట్రం తీసుకోగలిగింది. ఫిబ్రవరి, మార్చిలో కూడా 10 వేల కోట్ల చొప్పున ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. ఎంతమేరకు రుణం పొందేందుకు అవకాశం లభిస్తుందో చూడాల్సి ఉన్నది.

ఎకో టూరిజం కేంద్రంగా వికారాబాద్

- త్వరలో ఎకో, టెంపుల్, హెల్త్ టూరిజం పాలసీ
- రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం
- రైతులు మూడేండ్లు మొక్కలు పెంచితే ప్రభుత్వమే కొంటది
- చేవెళ్ల నియోజకవర్గంలో ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్క్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్



రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కును ప్రారంభించిన సీఎం

మొయినాబాద్, జనవరి 28: వికారాబాద్ అటవీప్రాంతాన్ని ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్‌లో సాధారణంగా చుట్టుపక్కల ప్రాంతాల కంటే 2 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, అందుకే ఇక్కడ టీబీ కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఇక్కడికి టీబీ ఉన్న వారిని తీసుకొస్తే ఇక్కడి వాతావరణం, ప్రకృతి సహజ వనరుల వల్లే వారికి జబ్బు తగ్గుతుందని అన్నారు. త్వరలోనే పెద్ద పెద్ద పరిశ్రమలవారు ఇక్కడకు వచ్చి వికారాబాద్ ప్రాంతాన్ని ఎకో టూరిజంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పొద్దుటూరు గ్రామంలో రామ్‌దేవ్‌రావు నూతనంగా ఏర్పాటుచేసిన ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కును పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీఎం రమేశ్, అనిల్‌మార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, సినీ నటుడు, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు. అంతకుముందు ఎలక్ట్రికల్ వాహనంలో వెళ్లి ఎక్స్‌పీరియం పార్కును తిలకించారు. ఎక్స్‌పీరియం పార్కు చైర్మన్ రామ్‌దేవ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెంపుల్, హెల్త్, ఎకో టూరిజం పాలసీలను తీసుకొస్తుందని తెలిపారు. వీటి వలన రాష్ట్రానికి గుర్తింపు, గౌరవంతోపాటు ఆదాయం లభిస్తుందని చెప్పారు. టూరిజం పాలసీపై ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే విధివిధానాలను తీసుకొస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, హెల్త్ టూరిజం, ఎకో టూరిజం లేకపోవడంతో ప్రముఖ వ్యాపారవేత్తలు, రాజకీయ, సినీ ప్రముఖులు ప్రస్తుతం ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లి శుభకార్యాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రపంచప్రఖ్యాతిగాంచిన మందిరాలు, ప్రకృతి వనరులు, నల్లమల్ల టైగర్ ఫారెస్టు, మల్లెల తీర్థం వంటివి ఉన్నాయని, వీటికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ఎకో టూరిజం వెనుకబడుతున్నదని చెప్పారు. రామ్‌దేవ్‌రావు 150 ఎకరాల విస్తీర్ణంలో 25 వేల జాతుల మొక్కలను 85 దేశాల నుంచి తీసుకొచ్చి ఎక్స్‌పీరియంను అద్భుతంగా తయారుచేశారని, ఇది వ్యాపార కేంద్రంగా కాకుండా పర్యాటక క్షేత్రంగా అవతరిస్తుందని చెప్పారు.

రామ్‌దేవ్‌రావు గొప్ప కళాకారుడు: చిరంజీవి

ఎక్స్‌పీరియం పార్క్‌ను తీర్చిదిద్దిను తీరు చూస్తేంటే రామ్‌దేవ్‌రావు వ్యాపారవేత్త మాత్రమే కాదని గొప్ప కళాకారుడనే భావన కలుగుతున్నదని నటుడు చిరంజీవి కొనియాడారు. ఎంతో కళా హృదయం లేకపోతే పాతికేండ్లపాటు శ్రమకోర్చి ఇంతటి అద్భుతాన్ని సృష్టించడం సాధ్యం కాదని ప్రశంసించారు. విదేశాల్లో లభించే మొక్కలను ఇప్పుడు హైదరాబాద్‌లోనే అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నుంచి వచ్చే రోడ్డును నాలుగైలైన్ల రోడ్డు (ఎక్స్ పీరియం ముందు రోడ్డు)గా అభివృద్ధి చేయాలని సీఎంను కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరు మీద మొక్క నాటాలి

రైతులు వరి పండించడమే కాదు ఎక్స్‌పీరియంలో ఏర్పాటుచేసిన మొక్కలను పెంచేలా చేయాలనుకుంటున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు మొక్కలు పెంచేందుకు క్షేత్రాలు ఇస్తున్నామని, ఆయా మొక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం రైతులు ఆరు నెలలే మొక్కలు పెంచడం వల్ల అవి 20 నుంచి 30 శాతానికి మించి బతకడం లేదని చెప్పారు. రెండు నుంచి మూడేండ్లు నిండే వరకు మొక్కలు పెంచితే, వాటిని తీసుకెళ్లి నాటితే ఎక్కువగా బతుకుతాయని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ విధివిధానాలపై చర్చించి, సవరించి ప్రకృతి పరిరక్షణ కోసం పాటు పడుతామని హామీ ఇచ్చారు. తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, దానిని పరిరక్షించాలనే విధానాన్ని తీసుకొస్తామని, త్వరలో విదివిధానాలు తీసుకొస్తామని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ ఎక్స్‌పీరియం ఎక్స్‌పీరియం హైదరాబాద్‌కు మణిహారంగా మారుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

వెబ్ సిరీస్ తెలివితేటలతోనే పెట్టుబడులా?

- పెట్టుబడులపై సీఎం రేవంత్ గాలి ముచ్చట్లు
- అంతర్జాతీయంగా రాష్ట్రం పరువు తీసిన సీఎం
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 28 (నమస్తేతెలంగాణ): అమెజాన్ వెబ్ సిరీస్ తెలి వి తేటలున్న సీఎం రేవంత్ పెట్టుబడు లు తెచ్చారంటే నమ్మేదెలా? అని రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్ రెడ్డి ప్రశ్నించారు. 'రేవంత్‌రెడ్డి మాటలు వింటే మే డిపండు గుర్తుకు వస్తున్నది. కనీసం ఆ పండులోపలైనా పురుగులు ఉంటా యి. కానీ ఆయన బుర్రలో ఏమీలేదనే విషయం అమెజాన్ వెబ్‌సిరీస్ మాటలతో తేటతెల్లమైంది' అంటూ ఎద్దేవా చేశారు. దావోస్ పెట్టుబడుల ప్రకటనలన్నీ ఉత్త గాలిముచ్చట్లే అనే విషయం స్పష్టంగా అర్థమైందని మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 'అమెజాన్ వెబ్ సర్వీసెస్‌ను వెబ్ సిరీస్ అని, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అన్న ఆయన మాటలు వింటుంటూ పెట్టుబడులు దేవుడెరుగు రాష్ట్రం పరువు తీశారనే విషయం బట్టబయలైందని మండిపడ్డారు. ఏ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారనే విషయం తెలియకుండా మాట్లాడుతున్న వ్యక్తి సీఎం సీట్లో కూర్చున్నారంటే నవ్వొస్తుందని పేర్కొన్నారు. తప్పుడు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని నిప్పులు చెరిగారు. ఫేక్ ఒప్పందాలతో అంతర్జాతీయంగా రాష్ట్ర పరువుతీశారని విమర్శించారు.

తిరుపతన్నకు విముక్తి

బెయిల్‌పై జైలు నుంచి విడుదల

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో 10 నెలల నుంచి రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న ఎస్ఐబీ అదనపు ఎస్పీ తిరుపతన్నకు జైలు నుంచి విముక్తి లభించింది. తిరుపతన్నకు సోమవారం సుప్రీం కోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం ఆయన కింది కోర్టులో జమానత్‌లను సమర్పించారు. తిరుపతన్న తరఫున ఆయన న్యాయవాది లక్ష చొప్పున ఇద్దరి పూచీకత్తులను 14వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించడంతోపాటు నిందితుడి పాస్‌పోర్టును కోర్టుకు స్వాధీనం చేశారు. అనంతరం తిరుపతన్న చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పైసల్లేక బంగారం ఇస్తలేం

- ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే తులంబంగారం ఇచ్చే ప్రయత్నం చేస్తాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం, జనవరి 28 : ప్రభుత్వం వద్ద సరిపడా నిధులు లేవని అందుకే కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా తాము ఇస్తామన్న తులం బంగారం ఇవ్వలేకపోతున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి, బంట్వారం మండల కేంద్రాల్లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి, వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల పనుల శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. నిధులు లేకనే హామీ ఇచ్చిన ప్రకారం తులం బంగారం పంపిణీ చేయలేకపోతున్నట్టు చెప్పారు. మెల్లమెల్లగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే తులం బంగారం సైతం అందజేస్తామని చెప్పుకొచ్చారు. మహిళలకు రూ.2,500లు కూడా త్వరలోనే ముఖ్యమంత్రి అందజేస్తారని తెలిపారు. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన అన్ని హామీలను త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ప్రజాభవన్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న డీఎస్సీ-2008 బాధితులు

ఏడాదైనా పోస్టింగ్‌లు ఇవ్వరా?

- ప్రభుత్వంపై డీఎస్సీ-2008 బాధితుల ఫైర్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ-2008 బాధితులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బైఠాయించారు. తమకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఫిబ్రవరిలో క్యాబినెట్ నిర్ణయించి ఇప్పటివరకు అమలుచేయలేదని వాపోయారు. వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారన్నారు. ఉద్యోగాల హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పోస్టులు కేటాయించలేదని మండిపడ్డారు. 400 మంది అభ్యర్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజాభవన్‌లోనే కూర్చున్నారు.

• '420 హామీలు' అమలెప్పుడు?

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు ఎప్పుడంటూ ఐటీ కారిడార్‌లో సరికొత్త క్యాంపెయిన్ మొదలైంది. రెండ్రోజుల క్రితం ఐటీ కారిడార్ గచ్చిబౌలి పరిధిలోని ఎమ్మార్ బౌల్డర్ హిల్స్‌లో నిర్వహించిన మ్యూజిక్ ఈవెంట్‌లో పలువురు 420 ప్లకార్డులు ప్రదర్శించారు. తాజాగా మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై ద్విచక్ర వాహనదారులు 420 హామీలను సూచించేలా ఉన్న హెల్మెట్లను ధరించి ర్యాలీగా వెళ్లారు. ఈ రెండు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, రాష్ట్ర వ్యాప్తంగా చర్చ మొదలైంది. - కొండాపూర్